కథా నిలయం
4572
శ్రీకాకుళం



# అనుబంధాలు

అది ఒక త్రీ బెడ్‌రూమ్ బిల్డింగ్. చుట్టూ ఒక కాంపౌండ్ వాల్. మనుషులు తిరగడానికి ఒకగేటు, కారుకు ఒక గేటు. రెండువైపులా బారులుతీరిన క్రోటన్స్, పువ్వులచెట్లు.

భవనంలోపలకువెళ్తే-ముందు హాలులో సుమారు మూడడుగుల ఎత్తుగల వజ్రకిరీటంతో వున్న శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహం. ఆ విగ్రహం మెడలో గంధపు చెక్కతో చేసిన హారం.

లోపల నుండి-పూజా మంత్రాలు వినిపిస్తున్నాయి. ఆయన ఆ ఇంటి యజమాని శ్రీనివాసమూర్తి. మంగళహారతి ఇస్తున్నారు.

ఎఱ్ఱంచువున్న తెల్లని పట్టుపంచెలో విభూతిరేఖలతో, కుంకుమతో వెలిగిపోతున్న ఆయన ముఖారవిందం. ఎఱ్ఱని ఛాయలో, మెడలో బంగారపు పువ్వులతో చుట్టిన రుద్రాక్షలు, సన్నని బంగారపు గొలుసు. వయసు పైబడినా శరీరం ముడతలు పడకుండా దృఢంగా వుంది.

మంగళహారతి గంట శబ్దం విని శ్రీనివాసమూర్తి గారి భార్య లోపల నుండి వచ్చింది.

ఆమె కలనేత కుంకుమరంగు వెంకటగిరి చేనేత చీరలో, అదే రంగు జాకెట్‌లో పచ్చగా వుండి, ఆ పసుపు రంగుకు తోడు, ముఖంనిండా పసుపురాసుకుని, నుదుట ఎఱ్ఱని కుంకుమబొట్టు పెట్టుకుని వుంది.

అప్పుడే మూర్తిగారు హారతి పళ్ళెం పట్టుకుని వచ్చారు.

ఆమె గబగబా వచ్చి హారతి కళ్ళకద్దుకుని-"ఈ వేళ శుక్రవారం. అమ్మాయి దగ్గరనుండి ఫోను రావాలండీ. ఎలా వున్నారో ఏమిటో-" అంది.

"లక్ష్మీ! జీవితంలో అనుబంధాలు ఒక నిర్ణీతకాలం వరకే మనం పరిమితం చేసుకోవాలి.

పిల్లల్ని కనడం, పెద్ద వాళ్ళని చెయ్యడం, విద్యాబుద్ధులు చెప్పించడం, ఆడపిల్లయితే,

అన్ని విధాలా అనుకూలమైన అబ్బాయికి ఇచ్చి వివాహం చెయ్యడం, మగపిల్లవాడైతే ఉద్యోగం వచ్చేవరకూ, పెళ్ళి చేసేవరకూ, ఆ తరువాత వాళ్ళ దాంపత్యజీవితంలో అడుగుపెట్టాక వాళ్ళకీ కొత్త అనుబంధాలు ఏర్పడతాయి.

ఆ కొత్త అనుబంధాల ముసుగులో మనం మరుగునపడిపోయే ప్రమాదం కూడా వుంది.

అందుకని పెళ్ళిళ్ళు అవగానే వాళ్ళతో వున్న అనుబంధం నెమ్మది, నెమ్మదిగా దూరం చేసుకోవడం మంచిది"

" చాల్లెండి. చెప్పొచ్చారు. నేను పిల్లల్ని తలుచుకుంటే చాలు, ఇలా ఉపన్యాసాలు ఇస్తారు. మీరేమో బయటపడరు. నేనే బైటపడతాను. అదే తేడా. మీకు మనసులో ఆరాటం లేదా? చెప్పండి?" అంది.

" అదిసరే ఫలహారాలు ఏమైనా వున్నాయా పిల్లల కబుర్లతో కడుపు నింపేస్తావా? " అన్నారాయన నవ్వుతూ.

వెంటనే ఆమె డైనింగ్ టేబుల్ మీద టిఫిన్ ఏర్పాటు చేసింది.

ఈలోగా ఫోను రింగైంది. ఇద్దరూ చేస్తున్న టిఫిను వదిలేసి ఫోను తీశారు. ఆయన చేతిలోంచి ఫోను తీశారు. ఆయన చేతిలోంచి ఫోను లాక్కుంది లక్ష్మి.

" ఏమే అమ్మాయ్ ఎలావున్నారు? ఏదో బాంబులు, యుద్ధం, అంటున్నారు? ఏ ప్రమాదం లేదు కదా-"

"....."

" మీ నాన్నగారికేం నిక్షేపంలా వున్నారు. దేముళ్ళు, పూజలు, పునస్కారాలు, పురాణ కాలక్షేపాలు. బాగానేవున్నాం. ఏం తల్లీ డెలివరీ తరువాత సమస్యలేవీ లేవు గదా-"

"....."

" అలాగా సంతోషం. ఏం పేరు పెట్టారు? 'పింకీ'నా. అదేం పేరే. లక్ష్మి అనో సరస్వతి అనో గాయత్రి అనో పెట్టుకోక "

" మీ ఇద్దరూ పిల్లలతో అనుకూలంగా వుండండి చాలు. పేర్లు ఏం చేస్తాయిలే. ఇదిగో నాన్నగారితో మాట్లాడు-"

" ఏరా-బావున్నావా? బుద్దిదానికి కాదు 'పింకీ'కి నా ముద్దులు. ఫొటోలు పంపించు ఆరోగ్యంగానే వున్నాను "

"....."

" ఇదిగో అమ్మతో మాట్లాడు-"

" ఏం తల్లీ. పాప ఎలా ఉంది? నా పోలికా? తాత పోలికా?"

"....."

" నీ ఇష్టం తల్లీ మరి వుంటాం అల్లుడిగార్ని అడిగినట్లు చెప్పు. మళ్ళీ ఫోను చెయ్యి-" అంటూ ఫోన్ పెట్టేసింది లక్ష్మి. మూర్తిగారు కళ్లు తుడుచుకుంటున్నారు.

"అనుబంధాలు దూరం చేసుకోవాలని నీతులు చెప్పడం కాదు " అంటూ ఆయన కన్నీళ్ళు తుడిచింది.

ఆయనేం మాట్లాడలేదు.

మూర్తిగారు ఆరోజు శుక్రవారం కావడంతో గుడికి బయలుదేరి వెళ్ళారు.

* * *

ఆ రోజు ఉదయం పూజాదికాలు పూర్తిచేసుకుని ఫలహారం చేసి భగవద్గీత పారాయణం చేసుకుంటున్నారు. ఇంతలో కారుహారన్ వినపడింది.

ఎవరు వచ్చారా అని లేచి నిలబడి చూశారు. మెరూన్ రంగు ఎంబాసిడర్ కారులోంచి అబ్బాయి, కోడలు, పిల్లలు దిగుతున్నారు.

అబ్బాయి వస్తూనే - " నాన్నగారూ బావున్నారా? అమ్మేది? " - అంటూ గబగబా లోపలికి వెళ్ళిపోయాడు. వాడు ఎప్పుడూ అమ్మ కావాలి. వాడు అమ్మ కొడుకు. అమ్మాయి తన కూతురు. ఇవి తమ దాంపత్యజీవితంలో సరదాగా అనుకునే మాట. సరదా ఏమిటి? నిజమే!

" మామయ్యగారూ. బావున్నారా? " అంటూ వస్తూనే పాదాభివందనం చేసింది కోడలు. " తాతగారి కాళ్ళకి దణ్ణం పెట్టండి " అంది పిల్లలిద్దర్నీ, వాళ్ళు ఏమిటో చిరాకుగా చూసి తల్లి మాట వినకుండా వెళ్ళిపోయారు.

" మామయ్యగారూ, వాళ్ళు ప్రయాణంలో అలిసిపోయారు" అంది వాళ్ళ ప్రవర్తనకు సంజాయిషీగా.

" అమ్మా - అదిగో నేను నీకు మెరూన్ రంగు ఇష్టమని ఆ రంగు కారు కొన్నాను. రా-ఎక్కుదుగాని ఒక రౌండ్ వేసి వద్దాం అందరం- " అంటూ లోపలనుండి తల్లిని

వెంటపెట్టుకుని వచ్చాడు అబ్బాయి.

" నా ఇష్టం ఏమిటే. నీకు ఇష్టమైన రంగు కొనుక్కోపోయావా? - " అంది

మూర్తిగారు అమ్మాయిని 'ఏరా' అనడం లక్ష్మి కొడుకుని 'ఏమే' అనడం వాళ్ళకు చిత్రమైన అలవాటు.

"నాన్నగారూ! బ్యాంకులో లోనుపెట్టి కారు కొన్నాను. క్యాంపులు తిరగడం చాలా కష్టంగా వుంది. ఎలాగూ నాకు ఫస్ట్ క్లాస్ ఫేర్స్ ఇస్తారు కదా. ఆ డబ్బుతో కారు వాయిదాలు కట్టవచ్చని ప్లాన్ చేసి కారు కొనేశాను " అంటూ తండ్రి దగ్గరకు వచ్చి చెప్పాడు. తండ్రి పక్కన సోఫాలో కూర్చున్నాడు.

" అమ్మా-మనం అందరం ఎక్కడికైనా వెళ్దాం. ఈ రోజు వంట చేయకు. హోటల్‌లో భోజనం చేద్దాం " అన్నాడు కొడుకు.

" పిచ్చీ, క్షణంలో వంటచేసేస్తాను. మీరు కబుర్లు చెప్పుకుంటూ వుండండి " అంటూ హడావిడి పడుతూ లోపలకి వెళ్ళింది లక్ష్మి.

" నాన్నగారూ, నేను వుండగా, అమ్మ, మీరూ ఒంటరిగా ఇక్కడ వుండటం ఏమీ బాగాలేదు, నాకూడా రమ్మంటే రారు- "

" బాబీ, మేము ఇద్దరమూ బ్రతికినన్నాళ్ళు బ్రతకం. పైగా మేము కొన్ని పద్ధతులకు, నియమాలకు అలవాటు పడిపోయాం. ఎవరింటికైనా వెళ్తే అవి కుదరలేదనుకో, వాళ్ళను ఇబ్బంది పెట్టినట్లవుతుంది. ఇప్పుడు కారు వచ్చిందిగా ఎప్పుడైనా వస్తాంలే. కారు పంపుదువుగాని, నాలుగురోజులు వుండిపోతుంటాం. "

ఈలోగా భోజనాలు తయారైనాయి. అత్తగారు, కోడలు వడ్డిస్తుంటే కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు.

సాయంత్రం ఐదుగంటలకు

" నాన్నగారూ! మేం వెళ్తాం. ఇప్పుడు బయలుదేరితే గాని రాత్రి పొద్దుబోయాకగాని చేరుకోలేం- "

" అదేంట్రా. సాయంత్రం వెంకన్న బాబు గుళ్ళో కారుకి పూజ చేయిందాలనుకున్నా. "

" అవన్నీ అయిపోయాయి నాన్నగారూ. ఏమే బయలుదేరండి " అనడంతో గబగబా అందరూ కారు ఎక్కేశారు. సజల నయనాలతో నోటికి కొంగు అడ్డంపెట్టుకుని వెళ్తున్న కారుని చూస్తోంది లక్ష్మి.

" పిచ్చిదానా- ఎందుకా కన్నీళ్ళు. అబ్బాయి మన ఎదురుగా పెద్దవాడై కారు కొనుక్కున్నాడు. పిల్లాపాపలతో సంతోషంగా వున్నాడు. అంతకన్నా ఏంకావాలి "

" కారులో వెళ్దామని అన్నాడుగదా. ఊళ్ళో మన బంధువులందరికీకారు చూపించాలని సరదాపడ్డాను. మళ్ళీ మాటవరసకి కారు ఎక్కమని అనలేదు-" ఆమె కళ్ళల్లో నీళ్ళు.

" నేను ఎప్పటినుంచో చెప్తున్నాను. మళ్ళీ చెప్తున్నాను. అనుబంధాలను దూరం చేసుకోవడం అలవాటు చేసుకుంటే అంతా ఆనందమే, ఉన్నతస్థితిలో వుండాలని మంచి చదువు చెప్పించాం. మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాడు. అలా అని మన ఎదురుగానే మనల్ని కనిపెట్టుకునే వుండాలంటే ఎలా కుదురుతుంది?

తనకూ భార్యాపిల్లలూ బంధాలు వున్నాయి. అమ్మ అనుబంధం ఈబంధాల వెనకపడిపోయింది. ఆ అనుబంధం చిన్నప్పటిదైనా, మనిషి జీవితం ఎప్పుడూ ప్రస్తుతం మీదే ఆధారపడివుంది. బాధపడకు- " అంటూ ఆయన లక్ష్మిని అనునయించారు. ఆ తర్వాత కాసేపటికి ఇద్దరూ గుడికి బయలుదేరారు.

✸ ✸ ✸

" ఎవడు తన ఋణములన్నింటిని తీర్చి, తద్వారా బంధవిముక్తుడై, స్వార్థరహితుడై, బాహ్య విషయాసక్తి లేక తృప్తుడై, ఆత్మానందమునుభవించుచుండునో అట్టివానికి కర్తవ్యమనునది లేదు. కర్తవ్యములన్నియు ఋణ విమోచనము కొరకే- అనృణుడగు వానికి కర్తవ్యమే లేదు. "

ఆ రోజు భగవద్గాత పారాయణం చేస్తుంటే ఎందుకో లక్ష్మి కూడా కూర్చుంది మూర్తిగారి ఎదుట.

" లక్ష్మీ! చూశావా కృష్ణభగవానుడు ఏం చెప్పాడో. మనం ఋణములన్నీ తీర్చాలి అంటే పిల్లలు కలిగాక మనం చేయవలసిన కర్తవ్యాలన్నీ ఋణాల క్రిందే వస్తాయి. ఈ ఋణములు తీరిస్తే ఆత్మానందం వస్తుందంటున్నారు.

కర్తవ్యాలన్నీ ఋణవిమోచనం కోసమే అంటున్నాడు. ఎప్పుడైతే మన కర్తవ్యాలు పూర్తి అయిపోతాయో ఇంక చేయవలసినవి ఏవీ వుండవు. అంటే ఋణాలు కూడా లేవు.

ఇప్పుడు మనం ఈ స్థితిలో వున్నాం. ఆత్మానందం పొందాల్సిన సమయం. మనం బంధవిముక్తులం కావడానికి ప్రయత్నించాలి అంతేకాని ఇంకాబంధాలలో చిక్కుకోడానికి ప్రయత్నించకూడదు తాపత్రయపడకూడదు. "

మూర్తి గార్ని నిశితంగా, వింతగా చూస్తోంది లక్ష్మి " ఈయన లాగా నేను వుండలేనేమో " అనుకుంటోందామె -

ఈలోగా ఫోను రింగయింది.

లేచివెళ్ళి ఫోను తీసింది.

" అమ్మా- ఏవిటి తల్లీ కులాసాయేనా - "

"....."

" ఎవరికి ఇచ్చి పంపించాడు? మన ఊళ్ళో ఇంజనీరుగారా-వాళ్ళ ఇల్లు మాకు తెలియదే- "

"....."

" అలాగే మీనాన్నగారు చేయిస్తారులే. పండక్కి వచ్చినప్పుడు తీసుకువెళ్తావా? ఇదిగో నాన్నగారితో మాట్లాడు-"

" ఏం చేస్తున్నావురా. అంతా బావున్నారా. పిల్లలకి ముద్దులు చెప్పు. నేను బాగానే వున్నాను.

మీ అమ్మ అలాగే కుస్తీ పడుతోంది. అయితే పండక్కి రండి తప్పక నేను నువ్వు చెప్పినవన్నీ చేయిస్తానులే ఇదిగో అమ్మతో మాట్లాడు- "

" తల్లీ వుంటానూ ఆరోగ్యం జాగ్రత్త, అల్లుడిగార్ని అడిగినట్లు చెప్పు తల్లీ " అంటూ ఫోన్ పెట్టేసింది.

" ఏమిటి? అన్ని నగలు చేయించమంటుంది. బంగారం ఎక్కడిది? " అన్నారు మూర్తి.

" ఈ ఊళ్ళో ఒక ఇంజనీరు గారిద్వారా కిలో బంగారం పంపించిందట. ఒక గజ్జెల వడ్డాణం, రెండు గొలుసులు, పన్నెండు గాజులు ఒక చిన్న నెక్లెస్ చేయించమంది. పండగకి వచ్చినప్పుడు తీసుకువెళ్తుందట.

" కిలో బంగారం అంటే అమ్మో బజారుకు ఎలా తీసుకువెళ్తాం? "

" కూడా నేనూ వస్తానెండి "

" నాకు చాలా ఆనందంగా వుందే పిచ్చిదానా. పిల్లలు ఈ స్థితిలో వుండటం చూడగలగడం ఎన్ని జన్మలలో నేను చేసుకున్న సుకృతం. నాకు ఎంతో సంతోషంగా వుంది. మాటలలో చేతలలో వ్యక్తపరచలేని సంతోషం ఎగిరి గెంతులేయాలని వుంది నాకూ- " అన్నారు మూర్తిగారు.

" చాల్లెండి చోద్యం. కిలోబంగారం పంపిస్తోంది కదా, పోనీ నాన్నగార్కి ఒక గొలుసు, నీకు నాలుగు గాజులు కూడా వాటిల్లో వున్నాయని ఒక్క మాటలో చెప్తే ఎంత బావుండేది. మీ జీవితమంతా పిల్లల కోసం ధారపోయడం జరిగింది.

రిటైరయ్యాక ఆఫీసువాళ్ళు ఇచ్చిన బంగారు గొలుసుతో గాని, మీ జీవితంలో బంగారు గొలుసు మెడలో వేసుకోవాలన్న కోరిక తీరలేదు.

ఈసంగతి అమ్మాయికి కూడా తెలుసును. రెండు కార్లున్నాయి కదా. ఒక కారు మనకి పంపకూడదూ- "

" పిచ్చమ్మా, ఇంత బోధించినా మళ్ళీ మొదటికే వచ్చావు. నీకు నేను వడ్డాణం చేయించలేకపోయాను గాని, ఏదో తిప్పలుపడి రెండు గొలుసులు, ఆరుగాజులు, ఒక నెక్లెస్ చేయించగలిగాను.

నీకు ఇంకా ఏమన్నా నగలు కావాలంటే చెప్పు-ఫిక్సెడ్‌లో వున్నది తీసి ఇంకో ఆరు గాజులు చేయించమంటావా- "

కృష్ణభగవానుడు చెప్పినట్లు కర్మలాచరించుటకు మాత్రమే నీకు స్వాతంత్ర్యము గలదు. ఫలములయందు నీకేమియును జోక్యము లేదు. కావున కర్మఫలముల నపేక్షింపకుము. నువ్వు ఈ శ్లోకాన్ని రోజుకు వందసార్లు చదువు. అప్పుడు పిల్లల గురించి మాట్లాడవు.

అనుబంధాలను దూరం చేసుకోవడం అలవాటు చేసుకోవాలంటే మనసును మరో మార్గంలోకి మళ్ళించాలి. అది భక్తి మార్గం కావచ్చు లేదా ఇంకో మార్గం కావచ్చు అందుకని- నువ్వు నా మార్గంలోకి వచ్చేయి. హాయిగా భగవధ్యానం చేసుకుందాం"

" అవును నిజమే. రేపటి నుండి మీతో పాటే నేను భగవద్గీత చదువుతాను. అనవసరంగా, అసంకల్పితంగా నా మనసులో ప్రవేశించే కోరికలు, ఆవేదనలతో కుమిలిపోతున్నాను."

"పిచ్చీ, నేను వుండగా నీకేం లోటు. నువ్వు నాకు కోట్లు విలువ చేసే ఆస్తి, వెండి, బంగారం ఇంకా ఖరీదైన క్రోమియం కూడా. మనకు అక్కరలేదు. అలాగే నేనూ-నీకూ అవునా? "

" అవును " అంటూ తలవంచుకుని కళ్ళలో నీళ్ళతో నవ్వడానికి ప్రయత్నిస్తున్న ఆమె నుదుట చుంబించారు మూర్తి. ఆయన పెదాలకు ఆమె నుదుటనున్న కుంకుమ అంటింది.

" ఇదేమిటి " అంటూ ఆయన పెదాలను చీర చెంగుతో తుడుస్తూ ఇప్పుడు మనస్ఫూర్తిగా నవ్వింది లక్ష్మి.

***